ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య


సుశాంత్ (ఫైల్)

ఖైరతాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం... ఖైరతాబాద్ మార్కెట్‌కు చెందిన బండారు చంద్రశేఖర్ ఇటీవల మృతిచెందాడు. 29న ఆయన దశదిన కర్మ కోసం వెళ్లిన తమ్ముడు వేణుగోపాల్, కుటుంబసభ్యులు గురువారం అర్ధరాత్రి తిరిగి ఇంటికి వచ్చారు. ఆ సమయంలో వేణుగోపాల్ కుమారుడు శశాంక్ (20) గదికి లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. ఎంత కొట్టినా తీయకపోవడంతో బలవంతంగా తలుపులు తెరిచారు. గదిలోని ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని అపస్మారకస్థితిలో ఉన్న శశాంక్‌ను కుటుంబసభ్యులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. శశాంక్ లక్డీకాపూల్‌లోని ఐఎంసీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఓ యువతితో ప్రేమలో పడ్డాడని, ఆ విషయమై ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి ఉంటాయని కుటుంబసభ్యులు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశారు. కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నామని ఏఎస్ఐ శ్రీరాములు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్‌కో ఉద్యోగి మృతి

- కన్నతల్లి ఎదుటే ప్రాణాలు విడిచిన కుమారుడు

బంజారాహిల్స్, మే 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కన్న తల్లి ఎదుటే కుమారుడు ప్రాణాలు విడిచాడు. మంగళ్‌హాట్‌కు చెందిన బాలనర్సింహ, అరుణజ్యోతి దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు నిఖిల్‌సాయి ట్రాన్స్‌కోలో క్లరికల్ స్టాఫ్‌గా పనిచేస్తున్నారు. అరుణజ్యోతి పెద్ద కుమార్తెకు ఇటీవలే కుమారుడు జన్మించాడు. ఉయ్యాల కార్యక్రమానికి అరుణజ్యోతి, నిఖిల్‌సాయి కలిసి శుక్రవారం ద్విచక్రవాహనంపై షేక్‌పేటకు బయలుదేరారు. మార్గమధ్యంలో సాయిబాబా ఆలయం వద్ద వాహనం అదుపు తప్పడంతో కింద పడ్డారు. నిఖిల్ తలకు తీవ్ర గాయం కావడంతో కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నిఖిల్ మరణించినట్టు వైద్యులు ప్రకటించారు. అరుణజ్యోతి ఫిర్యాదుతో ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక మెడలో చైన్ స్నాచింగ్

బంజారాహిల్స్, మే 31(ఆంధ్రజ్యోతి): షాపింగ్ కోసం బయటకు వెళ్లిన బాలిక మెడలో గుర్తుతెలియని మహిళ బంగారు గొలుసు స్నాచింగ్ చేసింది. లంగర్‌హౌస్‌కు చెందిన జి.జయశ్రీ తన కుమార్తె మహతిని తీసుకొని ఈనెల 30న డీ మార్ట్‌లో షాపింగ్‌కు వెళ్లింది. కొద్ది సేపటికి పాప మెడలో ఉన్న 10 గ్రాముల బంగారు గొలుసు కనిపించలేదు. సీసీ కెమెరాలు పరిశీలించగా బుర్కా వేసుకొని ఓ మహిళ బాలిక మెడలో ఉన్న గొలుసు కత్తిరించినట్టు తేలింది. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఎక్సైజ్ శాఖ పోలీసుల అదుపులో నిందితులు

డ్రగ్స్ అమ్ముతున్న ఇద్దరి అరెస్టు.. పరారీలో మరొకరు

బంజారాహిల్స్, మే 31 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ అమ్ముతున్న ఇద్దరిని అమీర్‌పేట ఎక్సైజ్ శాఖ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 11గ్రాముల ఎండీఏ, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు-5లో డ్రగ్స్ విక్రయిస్తున్నారని ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు అందడంతో దాడులు నిర్వహించి షాబాజ్‌ఖాన్, మహ్మద్ ఆదిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా వారి వద్ద 11గ్రాముల ఎండీ ఏ ఉంది. దీంతో వీరిద్దరిని అరెస్ట్ చేశారు. మరో నిందితుడు రియాజ్ పరారీలో ఉన్నట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పటేల్ బానోత్ తెలిపారు.

సినిమా షూటింగ్‌లు లేక..

మద్యం తాగేందుకు డబ్బు కోసం చోరీలు

- దొంగతో పాటు వాహనాలను కుదవ పెట్టుకున్న వ్యక్తి అరెస్టు


పొట్లూరి చంద్రశేఖర్, వీర వెంకట సత్యనారాయణ

బంజారాహిల్స్, మే 31(ఆంధ్రజ్యోతి): సినిమా షూటింగ్‌లు తగ్గాయి.. చేతిలో పని లేదు.. మద్యం తాగేందుకు డబ్బు అవసరమై దొంగగా మారాడో మేకప్ ఆర్టిస్ట్. వరుసగా నాలుగు వాహనాలు చోరీ చేసి వాటిని కుదవ పెట్టి వచ్చిన డబ్బుతో జల్సా చేసుకున్నాడు. దొంగతో పాటు వాహనాలను కుదవ పెట్టుకున్న వ్యక్తిని కూడా పోలీసులు కటకటాల వెనక్కి తోశారు. ఈనెల 24న ఓవ్యక్తి ఇందిరానగర్ సాయి వైన్స్ ఎదురుగా ద్విచక్ర వాహనం పార్క్ చేసి బయటకు వెళ్లాడు. తిరిగొచ్చి చూసేసరికి కనపించలేదు. దీంతో అతను బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అంతకు ముందు కూడా రెండు వాహనాలు ఇలాగే చోరీకి గురయ్యాయి. అప్రమత్తమైన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. కృష్ణానగర్‌కు చెందిన పొట్లూరి చంద్రశేఖర్ అని గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా సినీ పరిశ్రమలో మేకప్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తున్నాడు. షూటింగ్‌లు లేకపోవడంతో మద్యం తాగేందుకు డబ్బులు లేక చోరీలు చేస్తున్నట్టు తేలింది. 2022లో అబ్దుల్లాపూర్ మెట్ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ చోరీ కేసులో నిందితుడు. ఈయేడాది బంజారాహిల్స్ పోలీసుస్టేషన్ పరిధిలో నాలుగు చోరీలు చేశాడు. దొంగలించిన బండ్లను సినీ పరిశ్రమలో పనిచేస్తున్న రెడ్డి నాగ వీర వెంకట సత్యనారాయణ వద్ద కుదవ పెడుతున్నట్టు తేలింది. పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.


అధికారులతో కలిసి రామకృష్ణానగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ విజయా రెడ్డి

సమస్యలు తలెత్తకుండా చర్యలు

పంజాగుట్ట, మే 30(ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట రామకృష్ణానగర్ బస్తీలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. రామకృష్ణానగర్ బస్తీని ఆనుకుని ఉన్న ఎర్రమంజిల్ కాలనీలో నిమ్స్ ఆస్పత్రికి కేటాయించిన స్థలంలో జరుగుతున్న భవన నిర్మాణ పనుల వల్ల బస్తీకి మంచినీరు, సివరేజీ సమస్యలు వస్తాయని, రహదారి సౌకర్యం కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఈసమస్యలపైన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి ఆమె ఇటీవల వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆమె రామకృష్ణానగర్ బస్తీలో పర్యటించారు. సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని స్థానికులకు హామీ ఇచ్చారు.

ట్యాంక్‌బండ్, పరేడ్ గ్రౌండ్ పరిసరాల్లో..

ట్రాఫిక్ ఆంక్షలు


ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రావతరణ వేడుకల సందర్భంగా ట్యాంక్‌బండ్, పరేడ్‌గ్రౌండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని సీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై శనివారం ఉద యం నుంచి ఆదివారం రాత్రి 12 గంటల వరకు, గన్‌పార్క్ వద్ద ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 10గంటల వరకు, పరేడ్‌గ్రౌండ్ పరిసరాల్లో ఆదివారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయని తెలిపారు.

- **ట్యాంక్ బండ్ పరిసరాల్లో..**

అప్పర్ ట్యాంక్‌బండ్‌పై శనివారం ఉదయం 6 గంటల నుంచి జూన్ 2 రాత్రి 12 గంటల వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయి. నల్లగుట్ట జంక్షన్ నుంచి నెక్లెస్ రోటరీ వైపునకు వచ్చేవాహనాలను రాణిగంజ్ వైపునకు మళ్లిస్తారు. రాణిగంజ్ నుంచి నెక్లెస్ రోటరీ వైపునకు వచ్చే వాహనాలను మినిస్టర్ రోడ్ వైపునకు మళ్లిస్తారు. వీవీ స్టాచ్యూ వైపు నుంచి నెక్లెస్ రోటరీ వైపునకు వచ్చే వాహనాలను నల్లగుట్ట వైపునకు పంపుతారు. పాత సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ వైపునుంచి వచ్చేవాహనాలను రవీంద్రభారతి వైపునకు మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ వైపునుంచి వచ్చే వాహనాలను తెలుగుతల్లి ఫ్లైఓవర్ మీదుగా స్టీల్‌బ్రిడ్జి వైపునకు పంపుతారు. లిబర్టీ, బషీర్‌బాగ్ వైపునుంచి వచ్చేవాహనాలను అంబేడ్కర్ విగ్రహం నుంచి తెలుగుతల్లి ఫ్లైఓవర్ వైపునకు మళ్లిస్తారు. బండమైసమ్మ క్రాస్‌రోడ్ నుంచి వచ్చేవాహనాలను ఇందిరాపార్క్ వైపునకు పంపుతారు. కవాడిగూడ వైపునుంచి వచ్చేవాహనాలను బైబిల్ హౌస్, డీబీఆర్ మిల్స్ వైపునకు పంపుతారు.

- **గన్‌పార్క్ పరిసరాల్లో..**

సైఫాబాద్ పాత పోలీస్‌స్టేషన్, రవీంద్రభారతి జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను నాంపల్లి టి జంక్షన్ వైపు అనుమతించరు. నాంపల్లి టి జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలను ఏఆర్ పెట్రోల్ పంప్ మీదుగా బీజేఆర్ విగ్రహం వైపునకు పంపుతారు. రవీంద్రభారతి, ఏఆర్ పెట్రోల్ బంక్ జంక్షన్‌ల వద్ద భారీగా ట్రాఫిక్ ఉండే అవకాశముంది.

- **పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో..**

బేగంపేట వైపునుంచి సికింద్రాబాద్ వైపునకు వచ్చేవాహనాలను సీటీఓ, తివోలీ, వైఎంసీఏ, సంగీత్ క్రాస్‌రోడ్స్ వైపునకు పంపుతారు. బేగంపేట నుంచి కార్ఖానా వైపునకు వెళ్లే వాహనాలను పాట్నీ, వైఎంసీఏ వైపునకు మళ్లిస్తారు. ఆర్‌పీ రోడ్ వైపునుంచి తిరుమలగిరి వైపు వెళ్లే వాహనాలను ప్యాట్నీ, క్లాక్ టవర్, వైఎంసీఏ వైపు పంపుతారు. సంగీత్ నుంచి బేగంపేట వైపునకు వచ్చేవాహనాలను క్లాక్ టవర్, ప్యారడైజ్ మీదుగా రసూల్‌పురా దారికి పంపుతారు. ఆలుగడ్డబావి వైపు నుంచి తాడ్‌బండ్, బోయినపల్లి వైపు వెళ్లేవాహనాలను సీటీఓ, రాణిగంజ్ వైపునకు పంపుతారు. బోయిపల్లి వైపు నుంచి తివోలీ వైపు వచ్చే వాహనాలను సీటీఓ వైపునకు పంపుతారు. కార్ఖానా, జేబీఎస్, తిరుమలగిరి వైపు నుంచి ప్యాట్నీ వైపునకు వెళ్లే వాహనాలను స్వీకార్ ఉపకార్, వైఎంసీఏ, క్లాక్‌టవర్ వైపునకు పంపుతారు. తివోలి క్రాస్ రోడ్స్, ప్లాజా క్రాస్‌రోడ్స్ నుంచి పరేడ్ గ్రౌండ్‌కు వెళ్లే దారిని మూసివేస్తారు. ఆయా రూట్లలో ప్రయాణించే వాహనదారులు ఈ ఆంక్షలను దృష్టిలో ఉంచుకొని, ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించి రద్దీని నివారించాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

పొగాకును, మాదక ద్రవ్యాలను నిషేధించాలి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్, సూర్యనారాయణ రాజు, దైవజ్ఞ శర్మ, నాగేశ్వర్ రావు

పంజాగుట్ట, మే 31(ఆంధ్రజ్యోతి): పొగాకును, మాదక ద్రవ్యాలను సమూలంగా నిషేధించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఏ.అశోక్ అన్నారు. డాక్టర్ ఓగూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, డాక్టర్ రావూస్ ఓరల్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ నో టొబాకో డే సందర్భంగా శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశంలో పొగాకు వాడకంవల్ల వచ్చే వ్యాధులపై కరపత్రాన్ని నిమ్స్ సర్జికల్ ఆంకాలజీ విభాగం మాజీ హెచ్‌ఓడీ డాక్టర్ జి.సూర్యనారాయణ రాజు, ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఓ.నాగేశ్వరరావు, దైవజ్ఞ శర్మ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. పొగాకు, మాదక ద్రవ్యాలకు యువత బానిసలు కాకుండా చూడాలని వారు అన్నారు. మాదక ద్రవ్యాలను నిషేధించాల ని డిమాండ్ చేశారు. సమావేశంలో సినీ సంగీత దర్శకులు బల్లేపల్లి మోహన్, సాయం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎస్.సుధీర్, డాక్టర్ ఐ.చిట్టిబాబు, కుసుమ బోగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన


వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ప్రకాష్ నగర్ ఎక్స్‌టెన్షన్‌కు చెందిన మహిళలు

బేగంపేట, మే 31(ఆంధ్రజ్యోతి): గత రెండు నెలలుగా మంచినీరు రావడం లేదంటూ పలువురు మహిళలు ఖాళీ బిందెలతో ప్రకాష్‌నగర్ వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళనకు దిగారు. బేగంపేట్ డివిజన్‌లోని ప్రకాష్ నగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో గత రెండు నెలలుగా మంచినీరు సక్రమంగా రావడం లేదు. ఈవిషయంపై స్థానిక కార్పొరేటర్‌తో పాటు అధికారులకు స్థానికులు పలుమార్లు విన్నవించారు. ఆయన మంచినీరు రాకపోవడంతో విసుగు చెందిన మహిళలు శుక్రవారం ఖాళీ బిందెలతో ప్రకాష్ నగర్ వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ ఉన్న సిబ్బంది వారికి నచ్చజెప్పి పంపే ప్రయత్నం చేసిన వారు వినకుండా కార్యాలయం ముందు బైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. ఈ వేసవికాలంలో తాగునీరు రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి తమ ప్రాంతానికి సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చూడాలని కోరారు. వాటర్ వర్క్స్ మేనేజర్ వెంకటరెడ్డికి పలుమార్లు తమ సమస్యను తెలియజేసినా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించారని ఈ సందర్భంగా మహిళలు ఆరోపించారు.

ఏడాదిలో వంద దేశాలు తిరగాలనే కోరిక

- ఇప్పటికే 33 దేశాలు తిరిగా..
- జూన్ 2 నుంచి మరో 40 దేశాల్లో పర్యటన


మాట్లాడుతున్న రామకృష్ణ

పంజాగుట్ట, మే 31(ఆంధ్రజ్యోతి): ఒక క్యాలెండర్ ఇయర్‌లో వంద దేశాలు తిరిగి అక్కడి వింతలు, విశేషాలు ప్రజలకు తెలియజెప్పాలనే కోరిక ఆయనది. తన తల్లి కోరిక కూడా అదే. ఇప్పటి వరకు 33దేశాలు తిరిగాడు, జూన్ రెండు నుంచి మరో 40 దేశాలు తిరిగి రావాలని నిర్ణయించుకున్నాడు. అది కూడా పూర్తిగా శాఖాహారం మాత్రమే తీసుకుంటూ యాత్రను పూర్తి చేయాలి అనుకుంటున్నాడు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు సమావేశంలో కొండాపూర్‌లో నివాసం ఉంటున్న జనగామ జిల్లాకు చెందిన జి.రామకృష్ణ వివరాలు వెల్లడించారు. తల్లి జ్యోతిర్మయి రచయిత్రి అని, ఎన్నో కథలు, పుస్తకాలు రాశారని చెప్పారు. తాను ప్రపంచ యాత్ర చేయాలని, ఒక సంవత్సరంలో వంద దేశాలు చుట్టి రావాలని ఆమె కోరిక తెలిపాడు.

గత సంవత్సరం ఆమె మృతి చెందడంతో తన యాత్రను చూడలేకపోయిందని, ఈ సంవత్సరం జనవరి ఒకటి నుంచి డిసెంబర్ 31 వరకు ఒక క్యాలెండర్ ఇయర్‌లో వంద దేశాలు చుట్టి రావాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నానని తెలిపారు. జూన్ రెండు నుంచి మూడు నెలల పాటు 40 దేశాలు పర్యటిస్తానని తెలిపారు. ప్రస్తుతం తాను కొండాపూర్‌లో కృష్ణ జ్యోతి ఇన్ఫర్మాటిక్స్, అమెరికాలో కేజే ఇన్ఫో ఎల్.ఎల్.సి. పేరుతో సంస్థలు నిర్వహిస్తున్నానని అన్నారు.

'ప్రమాదాలు ఉచితం.. అవయవాలు కాదు'


రోడ్డు ప్రమాదాలు-వాటి నివారణపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

ఎర్రగడ్డ, మే 31(ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా వాహనం నడపడం చట్టవిరుద్ధం, ప్రమాదాలు ఉచితం - అవయవాలు ఉచితం కాదని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, బేగంపేట అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి.శంకర్ రాజు అన్నారు. శుక్రవారం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, హైదరాబాద్ సిబ్బంది ఆధ్వర్యంలో ఎర్రగడ్డలోని ప్రాంతీయ టెలికాం శిక్షణా కేంద్రం విద్యార్థులకు వారి సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. రేసింగ్‌లు, స్టంట్లు చేస్తూ తమ విలువైన ప్రాణాలు కోల్పోతూ తల్లితండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారని, ద్విచక్రవాహనంపై ట్రిపుల్ రైడింగ్ చేస్తే రూ. 1,200 వరకు జరిమానా విధిస్తారని మూడు నెలలు లైసెన్స్ సస్పెండ్ అవుతుందనీ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పని సరిగా లైసెన్స్ తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులు ఈ వయసు నుంచే పట్టుదల, కృషి, ఆత్మ విశ్వాసం అలవర్చుకోవాలని సూచించారు. వారికి కలిగిన సందేహాలను కూడా వివరించారు. కార్యక్రమంలో సుమారు 200మంది విద్యార్థులు, ప్రిన్సిపాల్ శ్రీ. వి.వి.సత్యనారాయణ, అడ్మిన్ శ్రీ.వివేక్ వారి సిబ్బంది, జి.శంకర్ రాజు అయాన్, పీసీ శ్రీ.కృష్ణ హీరో మోటార్ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలు శాఖల్లో ఉద్యోగ విరమణ


డైరెక్టర్ శ్రీధర్ బాబును సత్కరిస్తున్న ఎండీ సుదర్శన్ రెడ్డి, ఉద్యోగులు

హైదరాబాద్ సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డులో డైరెక్టర్ శ్రీధర్ బాబు ఉద్యోగ విరమణ చేశారు. దాంతో ఆయన నిర్వహిస్తున్న వాటర్‌బోర్డు పర్సనల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ బాధ్యతలను రెవెన్యూ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. ఎస్టీపీల నిర్మాణం, నిర్వహణ ప్రాజెక్టు విభాగం బాధ్యతలను సీజీఎంగా ఉన్న రఘుకు అప్పగిస్తూ ఎండీ నిర్ణయం తీసుకున్నారు. ఖైరతాబాద్‌లోని బోర్డు కార్యాలయంలో శుక్రవారం జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడ్కోల కార్యక్రమంలో ఎండీ సుదర్శన్ రెడ్డి హాజరై మాట్లాడారు. రిటైర్మెంట్ అనేది జీవితంలో ఒక భాగమన్నారు. మన ఉద్యోగ సమయంలో మనం ఏం చేశామో గుర్తు చేసుకోవడానికి.. భవిష్యత్తులో ఏం చేయాలో నిర్ణయించుకునే రోజు అన్నారు. కార్యక్రమంలో ఐఈఐ మాజీ అధ్యక్షులు రామేశ్వర్‌రావు, బోర్డు డైరెక్టర్లు అజ్మీరా కృష్ణ, వీఎల్ ప్రవీణ్ కుమార్, రవికుమార్, స్వామి, జేఈఏ ప్రతినిధులు, సభ్యులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

హెచ్‌జీసీఎల్ కార్యాలయంలో..


ఉద్యోగ విరమణ పొందిన మాజీద్ షరీఫ్‌తో హెచ్‌ఎండీఏ అధికారులు

హైదరాబాద్ సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎండీఏ-హెచ్‌జీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) మహ్మద్ మాజీద్ షరీఫ్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈసందర్భంగా నానక్‌రాంగూడలోని హెచ్‌జీసీఎల్ కార్యాలయంలో మాజీద్ షరీఫ్‌ను హెచ్‌ఎండీఏ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. 35ఏళ్లకు పైగా హెచ్‌ఎండీఏలో వివిధ హోదాల్లో అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణంలో, వాటి నిర్వహణలో మాజీద్ షరీఫ్ భాగస్వాములయ్యారు. ఔటర్ వెంట 158కిలో మీటర్ల మేర విద్యుద్దీపాల ఏర్పాటులో కీలకంగా పని చేశారు.



- టీజీఎస్పీడీసీఎల్‌లో కన్‌స్ట్రక్షన్ వింగ్‌లో ఎస్ఈగా పనిచేస్తున్న నెల్లి శ్రీరామ మూర్తి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. శ్రీరామమూర్తి మహబూబ్‌నగర్‌లో ఎస్ఈగా, సిద్ధిపేటలో డీఈగా, హైదరాబాద్‌లో పలు హోదాల్లో పనిచేశారు.

- హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)


నిమ్స్‌లో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులతో డైరెక్టర్ నగరి బీరప్ప

నిమ్స్ ఆస్పత్రిలో..

హైదరాబాద్ సిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రిలో పలువురు ఉద్యోగులు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. శుక్రవారం ఆస్పత్రిలో లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆస్పత్రి సంచాలకులు నగరి బీరప్ప వారిని సత్కరించి, వారు ఆస్పత్రికి చేసిన సేవలను కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో స్టాఫ్ నర్స్ తిరుపతమ్మ, శ్రీధర్ ఫైనాన్స్ కంట్రోలర్, గిరిధర్ ల్యాబ్ అసిస్టెంట్, నాగేశ్వర్‌రావు ఏసీ మెకానిక్, తిరుపతిరావు సీనియర్ రేడియోగ్రఫర్, ఉషారాణి సీనియర్ ఫార్మసిస్టులున్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ రిజిస్టర్ డాక్టర్ శాంతీవీర్, డాక్టర్ ఉషా, వివిధ ఉద్యోగుల సంఘ నాయకులు, ఉద్యోగులు పాల్గొని పదవీ విరమణ చేస్తున్న తోటి ఉద్యోగులను సన్మానించారు.

- ఇందిరాపార్క్ వద్ద బీజేపీ తలపెట్టిన ధర్నాకు తరలి వెళ్తున్న ఆ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గ నాయకులు గడ్డం వెంకటస్వామి, బోజిరెడ్డి, ముద్దంగుల శ్రీనివాస్, పందిర్ల ప్రసాద్ తదితరులు

- బంజారాహిల్స్, మే 31(ఆంధ్రజ్యోతి)



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, మే 31(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ బానోతు వరణ్ సింగ్ తెలిపారు.ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు 11 కేవీ విద్యుత్ టవర్స్, స్వరాజ్ నగర్ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 12గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11 కేవీ గ్రేహౌండ్స్, శ్రీరామ్ నగర్ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 2 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు 11 కేవీ హిందూ, సీతారామయ్య టవర్స్ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు 11 కేవీ సోమాజిగూడ, శంకర్‌లాల్ నగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

- బంజారాహిల్స్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ బంజారాహిల్స్ ఈ- సేవ కార్యాలయం, అక్బర్ ఫామ్ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11 కేవీ బంజారాహిల్స్ రోడ్ నెంబర్-7 మెరిడియన్ స్కూల్, దృష్టి కంటి ఆస్పత్రి ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 2 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు 11 కేవీ బంజారాహిల్స్ రోడ్ 10లోని రెయిన్‌బో ఆస్పత్రి, కమలాపురి కాలనీ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు బాబుఖాన్ చాంబర్స్, శ్రీనగర్ కాలని ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.
- సైఫాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ప్రేమానంద్ పాయ్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11 కేవీ అనంద్‌నగర్ కాలనీ, నాసర్ స్కూల్ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు 11కేవీ సోమాజిగూడ విజయ ఆస్పత్రి, ఐఓఈ, ఎన్టీఆర్‌మార్గ్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

'గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష వాయిదా వేయాలి'

పంజాగుట్ట, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్వహించ తలపెట్టిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను మూడు వారాల పాటు వాయిదా వేయాలని పలువురు అభ్యర్థులు డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చాలా రాష్ట్రాల్లో వివిధ పోటీ పరీక్షలు రెండు నుంచి మూడు వారాల పాటు వాయిదా వేశారని వారు తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశంలో గ్రూప్-1 అభ్యర్థులు ఏ.జనార్దన్, బి.అశోక్, ఇంద్రకుమార్ నాయక్, తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వశాఖల్లో పని చేస్తున్న కిందిస్థాయి ఉద్యోగులు ఉన్నత ఉద్యోగాల కోసం గ్రూప్-1 రాస్తున్నారని, వారిలో చాలామంది ఎన్నికల విధుల్లో ఉండడంతో వారు సరిగ్గా సిద్ధం కాలేదన్నారు. ఎన్నికల కౌంటింగ్ కూడా ఒక్క రోజులో అవుతుందో, కాదో తెలియని పరిస్థితి ఉందని, అలాంటి పరిస్థితిలో ముందు జాగ్రత్తగా పరీక్షలు వాయిదా నిర్ణయం తీసుకోవడం అవసరమన్నారు. కొత్త ప్రభుత్వం రాగానే ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి, గ్రూప్-1, గ్రూప్-2 లలో కొన్ని పోస్టులు భర్తీ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకోవాలని చూస్తోందని ఆరోపించారు. అన్నీ ఒకే సారి కాకుండా డిసెంబర్ నాటికి ఒక్కొక్కటిగా పరీక్షలు నిర్వహించాలని వారు కోరారు. శనివారం మధ్యాహ్నం నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారని, దానికి ముందే వాయిదా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు అభ్యర్థులు పాల్గొన్నారు.

గిరిజన రిజర్వేషన్లను పెంచాలి


వేర్వేరు సమావేశాల్లో మాట్లాడుతున్న సంజీవ్ నాయక్, రామచంద్రనాయక్

పంజాగుట్ట, మే 31(ఆంధ్రజ్యోతి): గిరిజనుల రిజర్వేషన్లను అగ్రకులాలు చాలెంజ్ చేయడం అన్యాయమని పలు గిరిజన సంఘాల నాయకులు అన్నారు. జనాభా దామాషా ప్రకారం తమ రిజర్వేషన్లను పెంచాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో వంద శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. గిరిజన రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జీవో నెంబర్ 33(పది శాతం రిజర్వేషన్లు), జీవో నెంబర్ 3(వంద శాతం రిజర్వేషన్లు)పై హైకోర్టు, సుప్రీం కోర్టులలో వేసిన కేసులు, గిరిజన రిజర్వేషన్లు, పదోన్నతులు, రక్షణ, గిరిజన మాట-బాట అనే అంశంపై సమితి చైర్మన్ భూక్య సంజీవ్ నాయక్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో మాజీ ఎంపీ జి.నగేష్, విశ్రాంత ఐపీఎస్ అధికారి డీటీ నాయక్, వివిధ గిరిజన సంఘాల నాయకులు మాట్లాడారు. కొంతమంది రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు విధించిన సీలింగ్‌ను సాకుగా చూపుతూ హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారని, తాము అగ్రకుల పేదలకు కల్పించిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ఏ న్యాయస్థానంలో కూడా చాలెంజ్ చేయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పీవీ రమణ, కిషన్ నాయక్, రామారావు, గణేష్ నాయక్, సంపత్ నాయక్, వెంకట్‌బంజారా, భాస్కర్, బాలకృష్ణ, రాజు పాల్గొన్నారు.

ఖైరతాబాద్: విద్యా, ఉద్యోగాల్లో గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లను అమలుచేస్తూ విడుదలైన జీఓపై కొందరు హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారని, దానిని ప్రభుత్వం సమర్థంగా తిప్పి కొట్టాలని ఆలిండియా బంజారా సేవా సంఘం కోరింది. శుక్రవారం ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని గిరిజన భవన్‌లో విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర నాయక్ మాట్లాడారు. సమావేశంలో సంఘం అసోసియేట్ అధ్యక్షులు ఆర్ మోహన్‌సింగ్, లీగల్ సలహాదారులు తేజావత్ జోగారాం, హైదరాబాద్ అధ్యక్షుడు గోపీచంద్, ప్రతినిధులు పాల్గొన్నారు.



సెయింట్ మేరీస్ బసలికా చర్చి ఆవరణలో శుక్రవారం మాజీ ఆర్చిబిషప్ తుమ్మబాల పార్థివ దేహాన్ని సందర్శించడానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

- సికింద్రాబాద్-ఆంధ్రజ్యోతి

శ్రీహనుమాన్ దేవాలయంలో హుండీ లెక్కింపు

తిరుమలగిరి, మే 31 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన శ్రీహనుమాన్ దేవాలయంలో శుక్రవారం ఈఓ మహేందర్ రెడ్డి సమక్షంలో హుండీ లెక్కింపు జరిగింది. ఉదయం నుంచి హుండీ లెక్కించగా 72 రోజులకు గాను 47358 రూపాయల ఆదాయం వచ్చింది. అయితే ఈ డబ్బులను దేవాలయ అభివృద్ధికి వెచ్చించడంతో పాటు దేవాలయం బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని ఈఓ తెలిపారు. దీంతో పాటు భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. హుండీ లెక్కింపులో ఇన్‌స్పెక్టర్ అండాలు, అర్చకులు వేణుగోపాల్ శర్మ, నాగేందర్ శర్మ, రాములు విష్ణువర్ధన్, బాబు సుందరం, ప్రేమ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి

శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని దేవాలయంలో అన్ని ఏర్పాట్లు చేశామని ఈఓ మహేందర్ రెడ్డి తెలిపారు ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకం, అర్చన, 9గంటలకు హోమం, మధ్యాహ్నం 1గంటకి అన్నదానం ఉంటుందని తెలిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి, స్వామి వారిని దర్శించుకుని తమతమ మొక్కులు చెల్లించుకుని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు. మహా అన్నదాన ప్రసాద వితరణలో పాలుపంచుకోవాలని కోరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

రైలు కింద పడి పెయింటర్ ఆత్మహత్య



శ్రీనివాస్ మృతదేహం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తాగుడికి బానిసైన ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన చర్లపల్లి ప్రాంత సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం మల్లాపూర్ ప్రాంతానికి చెందిన పి.శ్రీనివాస్ (48) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. తాగుడికి బానిసైన ఇతను తరుచుగా భార్యను వేధించి డబ్బులు లాక్కునేవాడు. డబ్బులు ఇవ్వకపోతే పలుమార్లు బెదిరించేవాడు. శుక్రవారం చర్లపల్లి డిలైన్, మౌలాలి సిక్యాబిన్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్ష

బోయినపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడు నరసింహకు మూడు సంవత్సరాలు జైలుశిక్ష, పదివేలు జరిమానా విధిస్తూ నాంపల్లి కోర్టు పోక్సో ప్రత్యేక న్యాయస్థానం తీర్పునిచ్చింది. అదనపు ప్రాసిక్యూటర్ రామ్‌రెడ్డి బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డిల కథనం ప్రకారం ఓల్డ్ బోయినపల్లి ఆర్ఆర్ నగర్‌కు చెందిన ఈసకంటి నరసింహ (51) 2022 డిసెంబర్ 1న పన్నెండేళ్ల బాలికను ఓ షెడ్డులోకి తీసుకువెళ్ళి బంధించాడు. తరువాత ఆ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ తర్వాత బాలిక తాను అక్కడ ఉన్న తమ బంధువుల బాలుడి ద్వారా కుటుంబ సభ్యులకు తెలియజేసింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు జరిగిన సంఘటనపై పోలీసులకు తెలిపి వారి సహాయంతో ఆ బాలికను కాపాడారు. దీంతో కుటుంబ సభ్యులు బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తు పూర్తిచేసి కోర్టులో చార్జిషీటట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి శుక్రవారం మూడేళ్ల జైలుశిక్ష, పదివేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. బోయినపల్లి పోలీసులు నిందితుడిని జైలుకి తరలించారు. ఈ కేసు విషయంలో సరైన న్యాయవిచారణ చేపట్టిన పోలీస్ బృందాన్ని ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి అభినందించారు.

బీమా పొడిగింపునకు

ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- సికింద్రాబాద్ న్యాయవాదుల హర్షం

అడ్డగుట్ట, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాప్తంగా కోర్టులో పనిచేస్తున్న న్యాయవాదులకు తెలంగాణ ప్రభుత్వం బీమా సేవలు తేదీని పొడించడంతో సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.వసంత్ కుమార్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం సికింద్రాబాద్ కోర్టులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో వివిధ కోర్టుల్లో విధులు నిర్వహిస్తున్న న్యాయవాదులకు ప్రభుత్వం గతం నుంచే వ్యక్తిగత బీమా సేవలు అందించింది. ఈనెల 28 వరకు బీమా చార్జీలకు సంబంధించి చివరి తేది కావడంతో న్యాయవాదులు హైరానా పడ్డారు. వివిధ రుగ్మతలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న న్యావాదులకు చివరి తేదీ కావడంతో న్యాయవాదులు హైరాన పడిపోయారు. ఈ క్రమంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుని ఇప్పటి వరకు ఈనెల 29 వరకు న్యాయవాదులకు సంబంధించిన రూ.7.9లక్షలు ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించడంతో పాటు మరో దఫా బీమా సేవల తేదీని పొడిగించడంతో సికింద్రాబాద్ కోర్టు న్యాయవాదులతో పాటు కుటుంబ సభ్యులు ప్రభుత్వంకు కృతజ్ఞతలు తెలిపింది.

నిరంతరం కోర్టు సేవల్లో పనిచేస్తున్న తమకు ఈ ప్రభుత్వం బీమా సేవలు పొడిగించడం ఆనందంగా ఉందని న్యాయవాదులు చెబుతున్నారు. మీడియా సమావేశంలో సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుశీల్ కుమార్, ఉపాధ్యక్షుడు సీనియర్ న్యాయవాది టి.వెంకటరమణలతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్, పరేడ్ గ్రౌండ్ పరిసరాల్లో..

ట్రాఫిక్ ఆంక్షలు



పరేడ్ గ్రౌండ్, ట్యాంక్ బండ్ వద్ద ఆంక్షలను సూచించే మ్యాప్‌లు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రావతరణ వేడుకల సందర్భంగా ట్యాంక్‌బండ్, పరేడ్‌గ్రౌండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని సీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై శనివారం ఉదయం నుంచి ఆదివారం రాత్రి 12 గంటల వరకు, గన్‌పార్క్ వద్ద ఆదివారం ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు, పరేడ్‌గ్రౌండ్ పరిసరాల్లో ఆదివారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయని తెలిపారు.

గన్‌పార్క్ పరిసరాల్లో..

సైఫాబాద్ పాత పోలీస్‌స్టేషన్, రవీంద్రభారతి జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను నాంపల్లి టి జంక్షన్ వైపు అనుమతించరు. నాంపల్లి టి జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలను ఏఆర్ పెట్రోల్ పంప్ మీదుగా బీజేఆర్ విగ్రహం వైపునకు పంపుతారు. రవీంద్రభారతి, ఏఆర్ పెట్రోల్ బంక్ జంక్షన్‌ల వద్ద భారీగా ట్రాఫిక్ ఉండే అవకాశముంది.

ట్యాంక్ బండ్ పరిసరాల్లో..

అప్పర్ ట్యాంక్‌బండ్‌పై శనివారం ఉదయం 6 గంటల నుంచి జూన్ 2 రాత్రి 12 గంటల వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయి. నల్లగుట్ట జంక్షన్ నుంచి నెక్లెస్ రోటరీ వైపునకు వచ్చేవాహనాలను రాణిగంజ్ వైపునకు మళ్లిస్తారు. రాణిగంజ్ నుంచి నెక్లెస్ రోటరీ వైపునకు వచ్చే వాహనాలను మినిస్టర్ రోడ్ వైపునకు మళ్లిస్తారు. వీవీ స్టాచ్యూ వైపు నుంచి నెక్లెస్ రోటరీ వైపునకు వచ్చే వాహనాలను నల్లగుట్ట వైపునకు పంపుతారు. పాత సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ వైపు నుంచి వచ్చే వాహనాలను రవీంద్రభారతి వైపునకు మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ వైపు నుంచి వచ్చే వాహనాలను తెలుగుతల్లి ఫ్లైఓవర్ మీదుగా స్టీల్‌బ్రిడ్జి వైపునకు పంపుతారు. లిబర్టీ, బషీర్‌బాగ్ వైపు నుంచి వచ్చేవాహనాలను అంబేడ్కర్ విగ్రహం నుంచి తెలుగుతల్లి ఫ్లైఓవర్ వైపునకు మళ్లిస్తారు. బండమైసమ్మ క్రాస్‌రోడ్ నుంచి వచ్చేవాహనాలను ఇందిరా పార్క్ వైపునకు పంపుతారు. కవాడిగూడ వైపునుంచి వచ్చేవాహనాలను బైబిల్ హౌస్, డీబీఆర్ మిల్స్ వైపునకు పంపుతారు.

పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో..

బేగంపేట వైపునుంచి సికింద్రాబాద్ వైపునకు వచ్చేవాహనాలను సీటీఓ, తివోలీ, వైఎంసీఏ, సంగీత్ క్రాస్‌రోడ్స్ వైపునకు పంపుతారు. బేగంపేట నుంచి కార్ఖానా వైపునకు వెళ్లే వాహనాలను పాట్నీ, వైఎంసీఏ వైపునకు మళ్లిస్తారు. ఆర్‌పీ రోడ్ వైపు నుంచి తిరుమలగిరి వైపు వెళ్లే వాహనాలను ప్యాట్నీ, క్లాక్ టవర్, వైఎంసీఏ వైపు పంపుతారు. సంగీత్ నుంచి బేగంపేట వైపునకు వచ్చే వాహనాలను క్లాక్ టవర్, ప్యారడైజ్ మీదుగా రసూల్‌పురా దారికి పంపుతారు. ఆలుగడ్డబావి వైపు నుంచి తాడ్‌బండ్, బోయినపల్లి వైపు వెళ్లేవాహనాలను సీటీఓ, రాణిగంజ్ వైపునకు పంపుతారు. బోయిపల్లి వైపు నుంచి తివోలీ వైపు వచ్చే వాహనాలను సీటీఓ వైపునకు పంపుతారు. కార్ఖానా, జేబీఎస్, తిరుమలగిరి వైపు నుంచి ప్యాట్నీ వైపునకు వెళ్లే వాహనాలను స్వీకార్ ఉపకార్, వైఎంసీఏ, క్లాక్‌టవర్ వైపునకు పంపుతారు. తివోలి క్రాస్‌రోడ్స్, ప్లాజా క్రాస్‌రోడ్స్ నుంచి పరేడ్ గ్రౌండ్‌కు వెళ్లే దారిని మూసివేస్తారు. ఆయా రూట్లలో ప్రయాణించే వాహనదారులు ఈ ఆంక్షలను దృష్టిలో ఉంచుకొని, ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించి రద్దీని నివారించాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

గ్రూప్-1, గ్రూప్-2 పోస్టులను భర్తీ చేయాలి

- ఎంపీ ఆర్. కృష్ణయ్య



టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డిను కలిసి వినతిపత్రం సమర్పించిన ఎంపీ ఆర్.కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం నేతలు

రాంనగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా కింద గ్రూప్-1 సర్వీస్‌లో 50 శాతం పోస్టులను ప్రభుత్వ శాఖ పూర్తిస్థాయిలో డైరెక్టుగా లెక్కించి భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గ్రూప్-2 సర్వీస్‌లో 30 శాతం నుంచి 40శాతం పోస్టులు లెక్కించి భర్తీ చేయాలన్నారు. ఈమేరకు శుక్రవారం టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి బీసీ సంక్షేమం నాయకులతో ఎంపీ ఆర్.కృష్ణయ్య ఈ అంశంపై చర్చించి వినతిపత్రం సమర్పించారు. అనంతరం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆర్.కృష్ణయ్య విలేకరులతో మాట్లాడుతూ కొత్త జిల్లాలకు పోస్టులు మంజూరు చేసి ఆప్షన్ పద్ధతి, వెయిటింగ్ లిస్టు పద్ధతి అమలు చేయాలన్నారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా కింద భర్తీ చేయాల్సిన గ్రూప్ 1, 2, 3, 4 సర్వీస్ ఉద్యోగాలను సరిగ్గా పూర్తి స్థాయిలో లెక్కించి, గణన చేసి భర్తీ చేయడానికి ప్రతిపాదనలు కొంతమంది ప్రభుత్వ అధికారులు పంపించలేదన్నారు.

గ్రూప్- 1 సర్వీస్ కింద గత పదేళ్లలో పోస్టుల భర్తీ చేయలేదని, గ్రూప్-2 సర్వీస్ కింద 6 ఏళ్లల్లో నోటిఫికేషన్ లేదన్నారు. గత పదేళ్లల్లో గ్రూప్-1, గ్రూప్-2 పోస్టులలో ఎంతమంది రిటైర్డ్ అయ్యారు, ఎంతమందికి ప్రమోషన్లు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ 23 జిల్లాల్లో 40 శాఖల జిల్లా ఆఫీసులు, తాలుకా ఆఫీసులు ఏర్పడ్డాయని, అలాగే 131 మండలాలు, 30 రెవెన్యూ డివిజన్ ఆఫీసులు, 76 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 25 డీసీపీ ఆఫీసులు, 31 పోలీస్ సర్కిల్స్, 7 పోలీసు కమిషనరేట్లు, 4,383 గ్రామ పంచాయతీలు కొత్తగా ఏర్పడ్డాయని ఆయన గుర్తుచేశారు. దీంతో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-4 సర్వీసు పోస్టులు పెద్ద ఎత్తున ఏర్పడ్డాయని, అయితే పోస్టులు మంజూరు చేయడంలేదన్నారు. ఇందులో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా లెక్కించి వాటిలో గ్రూప్-1లో 150 శాతం, గ్రూప్-2లో 30 నుంచి 40 శాతం పోస్టులు భర్తీ చేయాలన్నారు. గ్రూప్-4 సర్వీస్ జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 25ఏళ్లుగా పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. యువతను పాలనారంగంలోకి తీసుకువస్తే ఉత్సాహంతో, అంకితభావంతో నిజాయితీగా పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు. ఒకే దఫా 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేయడం గొప్ప విషయమన్నారు. తాము సమర్పించిన ఈ అంశాలపై పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చానని ఆర్.కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు నీల వెంకటేష్, గొరిగె మల్లేష్‌యాదవ్, వేముల రామకృష్ణ, కోట్ల శ్రీనివాస్, నంద గోపాల్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్ట్

- వీరిలో ఇద్దరు మైనర్లు
- కత్తులు, సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు, కత్తులు, సెల్‌ఫోన్లను చూపిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్‌రావు, ఏసీపీ జైపాల్‌రెడ్డి

బౌద్ధనగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): దోపిడీ దొంగల ముఠాను చిలకలగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు కత్తులు, రెండు ద్విచక్రవాహనాలు, రెండు సెల్‌ఫోన్‌లు, వెయ్యి రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్‌రావు, చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్ వివరాలు వెల్లడించారు. మే 29వ తేదీ రాత్రి తొమ్మిది గంటల సమయంలో మహ్మద్‌గూడ అక్బర్ హోటల్ వద్ద పద్మారావునగర్‌కు చెందిన విద్యార్థులు గౌతమ్, రాజకుమార్‌తో పాటు మరో యువకుడు, యువతి చదువు విషయంపై మాట్లాడుకుంటున్నారు. అక్కడకు వచ్చిన దోపిడీ దొంగల ముఠా సభ్యులు మహ్మద్ రహీమ్ బేగ్ అలియాస్ రహీమ్, మహ్మద్ షేక్ హుస్సేన్ అలియాస్ సోను, మహ్మద్ సమీర్, సయ్యద్ అహ్మద్ పాషా అలియాస్ అఫీర్, మహ్మద్ వాసిదుద్దీన్‌తోపాటు మరో ఇద్దరు మైనర్లు వారితో వాగ్వాదానికి దిగారు. విద్యార్థులు పరుగుతీయగా, దోపిడీ దొంగల ముఠా సభ్యులు వారిని వెంబడించారు. మైనర్ కర్రతో వారిని కొట్టిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. రాజ్‌కుమార్ అనే యువకుడి వద్ద సెల్‌ఫోన్, వెయ్యిరూపాయలు లాక్కున్నారు. ఎవరికైనా చెబితే చంపుతామని దోపిడీ దొంగలు బెదిరించారు. గౌతమ్ అదేరోజు రాత్రి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గాయపడిన గౌతమ్‌ను పోలీసులు చికిత్స నిమిత్తంగా గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు దాడి దృశ్యాల సీసీ ఫుటేజీలను పరిశీలించారు. గురువారం రాత్రి వారాసిగూడ చౌరస్తాలో ఐదుగురు యువకులను, ఇద్దరు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో యువకుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. మహ్మద్ రహీమ్ బేగ్‌కు నేరచరిత్ర ఉందని, మైనర్‌గా ఉన్నప్పుడే ఫైజల్ అనే యువకుడి హత్య కేసులో నిందితుడని డీసీపీ తెలిపారు. కేసును చేదించిన పోలీసు సిబ్బందికి రివార్డు అందజేస్తామని డీసీపీ చెప్పారు.



ఎక్సైజ్ శాఖ పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

డ్రగ్స్ అమ్ముతున్న ఇద్దరి అరెస్టు.. పరారీలో మరొకరు

బంజారాహిల్స్, మే 31(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ అమ్ముతున్న ఇద్దరిని అమీర్‌పేట ఎక్సైజ్ శాఖ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 11గ్రాముల ఎండీఏ, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు-5లో డ్రగ్స్ విక్రయిస్తున్నారని ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు అందడంతో దాడులు నిర్వహించి షాబాజ్‌ఖాన్, మహ్మద్ ఆదిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా వారి వద్ద 11గ్రాముల ఎండీఏ ఉంది. దీంతో వీరిద్దరినీ అరెస్ట్ చేశారు. మరో నిందితుడు రియాజ్ పరారీలో ఉన్నట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పటేల్ బానోత్ తెలిపారు.

చెత్తను తొలగించి ముగ్గులు వేశారు



ఇందిరాగాంధీ విగ్రహం ఎదురుగా పేరుకుపోయిన చెత్త డంపిక్ యార్డు



చెత్తను తొలగించి ముగ్గులు వేసిన జీహెచ్ఎంసీ సిబ్బంది

అడ్డగుట్ట, మే 31 (ఆంధ్రజ్యోతి): చెత్తను రోడ్లపై వేయకూడదని సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ అండ్ హెల్త్ రజినీకాంత్ సూచించారు. తుకారాంగేట్ ఇందిరా గాంధీ విగ్రహం ఎదురుగా స్థానికులు విపరీతమైన చెత్త వేయడంతో దుర్గంధం భరించలేకపోతున్నామని, తాము ముందునుంచే చెబుతున్నామని, కాలనీవాసులు ఎవరైనా సరే ఇంటికి వచ్చే రిక్షావాళ్లకు మాత్రమే చెత్త వేయాలని, ఇలా రోడ్డు పక్కన చెత్త అందరికీ ఇబ్బందికరంగా మారుతుందన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేసి ఆ ప్రాంతంలో జీహెచ్ఎంసీ శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ అఖిల్ ఆధ్వర్యంలోశానిటేషన్ సిబ్బంది ముగ్గులు వేసి అందంగా తయారు చేశారు. ఇక్కడ చెత్త వేయకూడదని హెచ్చరించారు.

భవన నిర్మాణం కోసం పచ్చనిచెట్టు నరికివేత

- చెట్టు నరికివేతపై స్థానికుల ఆందోళన



వారాసిగూడ పోచమ్మ ఆలయం వద్ద నరికివేసిన చెట్టు



నరికేసి రోడ్డుపై పడవేసిన చెట్టుకొమ్మలు

బౌద్ధనగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణం కోసం ఓ ఇంటి యజమాని పచ్చనిచెట్టును నరికివేశాడు. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్టు నరికివేసిన విషయాన్ని జీహెచ్ఎంసీ హార్టికల్చర్, ఫారెస్ట్ విభాగం అధికారులకు ఫిర్యాదు చేశారు. వారాసిగూడ పోచమ్మ ఆలయం వద్ద ఓ వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా పాతభవనంపై అదనపు అంతస్తులను నిర్మాణం చేస్తున్నాడు. భవన నిర్మాణానికి భారీచెట్టు అడ్డురావటంతో సదరు యాజమాని జీహెచ్ఎంసీ హార్టికల్చర్, ఫారెస్ట్ విభాగం నుంచి అనుమతులు తీసుకోకుండా స్థానిక నాయకుల అండదండలతో శుక్రవారం తెల్లవారుజామున చెట్టును నరికివేశాడు. నీడనిచ్చే చెట్టును నరకవద్దని స్థానిక మహిళలు మొరపెట్టుకున్నా వినిపించుకోకుండా చెట్టును నరికివేశాడు. నరికివేసిన భారీకొమ్మలను రోడ్డుకు అడ్డంగా పాడవేశారు. దీంతో వాహనదారులు, స్థానికులు నరికివేసిన చెట్టుకొమ్మలతో ఇబ్బందులు పడుతున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లను పెంచాలని ఓ పక్క ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేస్తుంటే నీడనిచ్చే చెట్లను కొట్టే అధికారం ఎవ్వరు ఇచ్చారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చెట్టును కొట్టువేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



గాయపడిన అని వి జయకర్‌ని పరామర్శిస్తున్న మురళి తదితరులు

మహిళా టీటీఈపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్

చిలకలగూడ, మే31 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో ఉన్న మహిళపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు కొత్త మురళి డిమాండ్ చేశారు. గురువారం యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో విధులు నిర్వహిస్తున్న టీటీఈ అని వి జయకర్‌పై అగంతకులు దాడి చేయడంతో చేయి డిస్‌లోకేట్ అయింది. లాలాగూడ రైల్వే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు శుక్రవారం పరామర్శించి తమ మద్దతు తెలిపారు. అనంతరం మురళి మాట్లాడుతూ విధినిర్వహణలో వున్న ఉద్యోగులకి రక్షణ కల్పించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకి సూచించారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, వేగి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వర్లుకి సన్మాన పత్రం అందజేస్తున్న మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీ.హెచ్.శంకర్ రావు తదితరులు

రైల్వేలో 96మంది పదవీ విరమణ

చిలకలగూడ, మే31 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 96మంది ఉద్యోగులు శుక్రవారం పదవీ విరమణ చేశారు. హెడ్ క్వార్టర్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లతో పాటు లాలాగూడ వర్క్ షాపులో వీరు విధులు నిర్వహించారు. పదవీ విరమణ చేసిన వారికి ఆత్మీయ వీడ్కోలు పలుకుతూ సికింద్రాబాద్‌లోని రైల్వే కార్యాలయాలు కోలాహలంగా మారాయి. రిటైరయినవారికి రావలసిన బకాయిలు వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేయడానికి చర్యలు చేపట్టి, వారికి అందే పెన్షన్ వివరాలు అందజేశారు. సికింద్రాబాద్ డివిజన్‌లో వెంకటేశ్వర్లు, హైదరాబాద్ డివిజన్‌లో పి.ఆర్.శ్రీనివాస్, లేఖాభవన్‌లో షబ్బీర్ అహమద్‌లను కార్మిక సంఘనాయకులు శాలువాతో సత్కరించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు.

చిలకలగూడ పోలీస్‌స్టేషన్ నూతన భవనం ఏర్పాటుకు చర్యలు

- డీసీపీ గిరిధర్ రావుల



గిరిధర్ రావుల, డీసీపీ, ఈస్ట్‌జోన్

బౌద్ధనగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ పోలీస్‌స్టేషన్ నూతన భవనం ఏర్పాటుకు తగిన ప్రయత్నం చేస్తున్నామని ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్ తెలిపారు. ఇటీవల ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన 'శిథిలావస్థకు చేరిన చిలకలగూడ రక్షకభట నిలయం, ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి' కథనానికి డీసీపీ స్పందించారు. చిలకలగూడ పోలీస్‌స్టేషన్ భవనం శిథిలావస్థకు వచ్చిన విషయాన్ని ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లామని, నూతన భవనం ఏర్పాటు త్వరలోనే ఉంటుందని తెలిపారు. ఈస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయ నూతన భవనం త్వరలో ప్రారంభమవుతుందని, ఆ ప్రక్రియ పూర్తికాగానే చిలకలగూడ పోలీస్‌స్టేషన్ నూతన భవనం ఏర్పాటుపై తగిన ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు.



బహుమతి విజేతలతో ఎన్‌టీపీసీ అధికారులు

పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహన కోసమే

స్వచ్ఛతా పఖ్వాడా పక్షోత్సవాలు

పద్మారావునగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా పఖ్వాడా పక్షోత్సవాలలో భాగంగా ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన అనేక కార్యక్రమాలను విజయవంతం చేయటానికి ప్రత్యేక చొరవ చూపిన ఎన్‌టీపీసీ సిబ్బందికి అభినందనలు తెలియజేస్తున్నానని ఎన్‌టీపీసీ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) ఎస్ఎన్.పాణిగ్రహి అన్నారు. స్వచ్ఛతా పఖ్వాడా పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం కవాడిగూడ ప్రధాన దారిలోని ఎన్‌టీపీసీ దక్షిణ ప్రాంత కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాణిగ్రహి మాట్లాడుతూ... ప్రజలలో పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహన కలగటానికి స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా అనేక కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. ఎన్‌టీపీసీ స్వచ్ఛతా పఖ్వాడాలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు మొక్కలు నాటడం, మార్నింగ్ వాక్, అవగాహనా శిబిరాలు, చిత్రలేఖనం, వ్యాసరచన, స్లోగన్ రైటింగ్ వంటి అనేక పోటీలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎన్‌టీపీసీ టీమ్ జీహెచ్ఎంసీ సహకారంతో పురాతన, చారిత్రాత్మక కట్టడమైన చార్మినార్ కట్టడం పరిసరాలను శుభ్రపరచడంతో స్థానికులు అభినందించారు. మేకలమండిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. పక్షోత్సవాలలో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు ఈడీ (ఎఫ్‌జీడీ అండ్ ఎన్‌పీజీ) ప్రసేన్‌జిత్‌పాల్, ఈడీ (ఎఫ్‌జీడీ అండ్ ఎన్‌పీజీ) బీఎస్ రావులు బహుమతులను అందజేశారు. కార్యాలయంలో నిత్యం పారిశుద్ధ్య సేవలను అందిస్తున్న ఎన్‌టీపీసీ హౌస్‌కీపింగ్ కార్మికులను ఈ సందర్భంగా సత్కరించారు. పక్షోత్సవాలలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలకు సంబంధించిన ఒక లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమానికి ఎన్‌టీపీసీ డీజీఎం(హెచ్.ఆర్)బద్రుద్దీన్ అన్సారి, మేనేజర్ (కార్పొరేట్ కమ్యూనికేషన్) ప్రియాంక భుయాన్, ఇతర సిబ్బంది, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం.మల్లికార్జున రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లి ఎదుటే ప్రాణాలు విడిచిన కుమారుడు

- రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్‌కో ఉద్యోగి మృతి

బంజారాహిల్స్, మే 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తల్లి ఎదుటే కుమారుడు ప్రాణాలు విడిచాడు. మంగళ్‌హాట్‌కు చెందిన బాలనర్సింహ, అరుణజ్యోతి దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు నిఖిల్ సాయి ట్రాన్స్‌కోలో క్లరికల్ స్టాఫ్‌గా పనిచేస్తున్నారు. అరుణజ్యోతి పెద్ద కుమార్తెకు ఇటీవలే కుమారుడు జన్మించాడు. ఉయ్యాల కార్యక్రమానికి అరుణజ్యోతి, నిఖిల్ సాయి కలిసి శుక్రవారం ద్విచక్రవాహనంపై షేక్‌పేటకు బయలుదేరారు. మార్గమధ్యంలో సాయిబాబా ఆలయం వద్ద వాహనం అదుపు తప్పడంతో కిందపడ్డారు. నిఖిల్ తలకు తీవ్ర గాయం కావడంతో కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నిఖిల్ మరణించినట్టు వైద్యులు ప్రకటించారు. అరుణజ్యోతి ఫిర్యాదుతో ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.